మొదటి ఘట్టం ఆవిష్కృతం

- గద్దెనెక్కిన సారలమ్మ.. దర్శించుకుంటున్న భక్తులు
- మేడారానికి పెద్దఎత్తున తరలుతున్న జిల్లా ప్రజలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

డప్పు చప్పుళ్లు.. శివసత్తుల పూనకాలు.. మహిళల మంగళహారతులు.. భక్తుల కోలాహలం మధ్య వీర వనిత సారలమ్మ బుధవారం గద్దెపై కొలువుదీరింది. దీంతో సమ్మక్క-సారలమ్మ జాతర మొదటి ఘట్టం ఆవిష్కృతమయ్యింది. జాతర ప్రాంగణాలకు చేరుకున్న భక్తులు ఆ తల్లిని దర్శించుకున్నారు. అలాగే గోవిందరాజు, పగిడిద్దరాజును ప్రతిష్ఠించారు. మేడారంనకు అనుబంధంగా జిల్లాలోని గోలివాడ, గోదావరిఖని, నీరుకుళ్ల, కొలనూరు, గర్రెపల్లి, మంగపేట, మీర్జంపేట, మడక, జీలకుంట, హన్మంతునిపేట, తుర్కలమద్దికుంట, మైదంబండ, ఈసాలతక్కళ్లపల్లి, వేంనూర్, రాణాపూర్, ధర్మారం, ఎర్రగుంటపల్లి, కొత్తూరు, నందిమేడారం, బొట్లవనపర్తి, కటికెనపల్లి, తదితర ప్రాంతాల్లో జరుగుతున్న జాతరల ప్రాంగణంలో మేడారం నుంచి వచ్చిన కోయ పూజారులు సారలమ్మను గద్దెలపై ప్రతిష్ఠించారు. దీంతో రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర ప్రారంభమయ్యింది. ఆ తల్లులను దర్శించుకునేందుకు వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి ముల్లెమూట సర్దుకుని పిల్లాపాపలతో జాతరలకు చేరుకున్నారు. వివిధ ప్రాంతాల్లో జాతర కమిటీ నిర్వాహకులు పూజలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చాలంటూ భక్తులు ఆ తల్లులను వేడుకుంటున్నారు.

● నేడు చిలకల గుట్ట సమ్మక్క రాక..

చిలకలగుట్ట నుంచి గురువారం సాయంత్రం వడ్డెలు కంక చెట్లు, కుంకుమ భరిణె రూపంలో సమ్మక్క తల్లిని అంగరంగ వైభవంగా గద్దెలపైకి తీసుకరానున్నారు. సమక్క రాకతో శుక్రవారం పెద్దఎత్తున తల్లులకు భక్తులు మొక్కులు సమర్పించనున్నారు.

● బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ..

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ప్రధానంగా జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివెళుతున్నారు. ఆర్టీసీబస్సుల్లో మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పెద్దఎత్తున భక్తులు మేడారం వెళుతున్నారు. ఉచిత ప్రయాణం నేపథ్యంలో గతంలోకంటే ఈసారి బస్సుల సంఖ్యను కూడా పెంచారు. మేడారం వెళ్లేందుకు ఆర్టీసీ అధికారులు మూడు రోజుల క్రితం నుంచే ప్రత్యేక బస్సులు నడుపుతున్నప్పటికీ, బుధవారం పెద్దపల్లి, గోదావరిఖని, మంథని, యైటింక్లయిన్ కాలనీ నుంచి ఉదయం నుంచే అనేకమంది భక్తులు బస్టాండ్లకు చేరుకుని ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు. ఆర్టీసీ బస్సుల్లో బుధవారం ఒక్కరోజే జిల్లానుంచి 10 నుంచి 12 వేల మంది తరలివెళ్లగా, ప్రైవేట్ వాహనాల్లోనూ మరో 10వేల మంది వరకు మేడారం వెళ్లారు. స్థానికంగా జరిగే జాతర ప్రాంగణాలు గురు,శుక్రవారాల్లో భక్తుల పూనకాలతో ఊగిపోనున్నాయి.



'ఖని'లో సారలమ్మను గద్దెపై ప్రతిష్టిస్తున్న కోయ పూజారులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 21: గోదావరిఖని గోదావరి తీరాన జనం జాతరలో బుధవారం రాత్రి సారలమ్మ గద్దెనెక్కింది. మూడు రోజుల పాటు గోదావరి వంతెన సమీపంలో వైభవంగా జరిగే జాతరలో మొదటి ఘట్టంగా సారలమ్మను గద్దెలకు తీసుకువచ్చారు. రాత్రి 9గంటలకు సారలమ్మ గద్దెనెక్కింది. స్థానిక జీఎం కార్యాలయం సమీపంలోని సారలమ్మ దేవాలయంవద్ద కోయ పూజారులు శ్యామ్, అరుణ్‌కుమార్, సమ్మయ్య, రాము సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ కాంతారెడ్డి, జాతర కమిటీ బాధ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బంగారి కనయ్య, గోదావరిఖని మడక రమేష్ పర్యవేక్షించారు. దేవాలయం వద్ద భక్తులు పొర్లుదండాలు పెట్టారు. పూజారులు వారిపై నుంచి నడుచుకుంటు సారలమ్మను తీసుకువచ్చారు. అక్కడినుంచి భారీఊరేగింపుగా సాగింది. రాజీవ్ రహదారి వద్ద పవర్‌హౌస్‌కాలనీ, ఉదయ్‌నగర్ తదితర ప్రాంతాల్లో జనం పెద్దఎత్తున స్వాగతం పలికారు. డప్పువాయిద్యాల మధ్య నృత్యాలతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. సారలమ్మ దేవాలయం నుంచి జాతర గద్దెల వరకు చేరేందుకు మూడు గంటల సమయం పట్టింది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్‌లు పూజలు నిర్వహించారు. సారలమ్మ గద్దెకు చేరుకోవడంతో జాతరకు ఊపు వచ్చింది. పెద్దఎత్తున భక్తులు జాతరకు తరలివస్తున్నారు. జాతర వద్ద ఉదయం నుంచే భక్తులు అమ్మలను దర్శించుకునేందుకు సమ్మక్క జాతర ప్రాంగణానికి తరలివచ్చారు. మొక్కులు ఉన్న భక్తులు కోళ్లను గాలికిలోకి వదిలి మొక్కులు చెల్లించుకున్నారు. బంగారం(బెల్లం) సమర్పించుకున్నారు. గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు భారీగా తలనీలాలు సమర్పించారు. సమ్మక్క-సాలరమ్మ గద్దెలను దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. మొదటి రోజు బుధవారమే గోదావరిఖని జాతర ప్రాంతానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. మంచిర్యాల జిల్లా నుంచి కూడా జాతరకు భక్తులు తరలివస్తున్నారు. ఈ రెండు జిల్లాలో విస్తరించిన సింగరేణి ప్రాంతంలోని గని కార్మిక కుటుంబాలు అత్యధికంగా ఈ జాతరలోనే పాల్గొంటున్నారు.

ఎమ్మెల్యే దంపతుల పూజలు

గోదావరి వంతెన వద్ద ఏర్పాటు చేసిన జాతరను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, మనాలి దంపతులు పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం నిలువెత్తు బంగారం అమ్మవార్లకు సమర్పించారు. ఈవో కాంతారెడ్డి, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, దాతు శ్రీనివాస్, కొలిపాక సుజాత, జనగామ కవిత సరోజిని, నాయకులు కాల్వ లింగస్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, బొమ్మక రాజేష్, పెద్దెల్లి ప్రకాష్, చుక్కల శ్రీనివాస్, తిప్పారపు శ్రీనివాస్, కౌటం సతీష్, కళ్యాణి సింహాచలం, గుండేటి రాజేష్, నాయిని ఓదెలు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, ఫిబ్రవరి 21: మండంలోని నీరుకుళ్లలో సమ్మక్క-సారలమ్మ జాతర బుధవారం జాతర నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు ఘనంగా ప్రారంభించారు. ప్రత్యేకపూజల అనంతరం కోయ పూజారులను వెంట తీసుకుని జాతర ప్రాంగణంలోని గుట్టపైకి మంగళవాయిద్యాలతో భక్తసమూహంతో వెళ్లి గుట్టుగుహలో ఉన్న సారలమ్మను ఊరేగింపుగా తీసుకుని వచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. జాతర మొదటిరోజే భక్తులు నీరుకుళ్లకు పెద్దఎత్తున తరలివచ్చారు. జాతర కమిటీ చైర్మన్ నర్సయ్యగౌడ్, ఈవో శంకర్, డైరక్టర్లు పాల్గొన్నారు. గర్రెపల్లి, నారాయణపూర్, తొగర్రాయిలోనూ జాతరలు ప్రారంభమయ్యాయి.

మంథని, ఫిబ్రవరి 21: మంథని డివిజన్‌లో పలు చోట్ల శ్రీసమ్మక్క-సారలమ్మ జాతరలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మేడారం తీసుకువచ్చి గిరిజన పూజారులు సారలమ్మకు ప్రత్యేక పూజలు చేసి మేళాతాళాలతో గద్దెపైకి తీసుకువచ్చారు. గ్రామస్తులతో పాటు చుట్టు ప్రక్కల ప్రజలు దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు. శివసత్తులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బస్టాండ్‌లో ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన శిబిరాన్ని ఆర్డీవో హనుమానాయక్ ప్రారంభించారు.

ధర్మారం, ఫిబ్రవరి 21: మండలంలో బుధవారం సమ్మక్క-సారక్క జాతర ప్రారంభమైంది. సారక్కను సమీప గుట్టల వద్ద నుంచి డప్పుచప్పుల తో భారీ ఊరేగింపుతో కోయ పూజారులు గద్దెల వద్దకు తీసుకువచ్చారు. పూజలు చేసిన తర్వాత సారక్కకు గద్దెపైకి ఎక్కించారు. మహిళలు పెద్దఎత్తున పూజలు చేశారు. మండలంలోని ధర్మారం, ఎర్రగుంటపల్లి, కటికెనపల్లి, కొత్తూర్, దొంగ తుర్తి, బొట్లవనపర్తి, నందిమేడారం, చామనపల్లి, నర్సింగాపూర్ గ్రామా ల్లో సారక్కకు భక్తులు చెల్లించుకు న్నారు. ధర్మారంలో రేణుక ఎల్లమ్మ ఆలయం సమీపంలోగల గుట్టపై నుంచి సారక్కను తీసుకువచ్చి రోడ్డు మార్గం ద్వారా శీతల్ల చెరువు సమీపంలోని గద్దెల వరకు కాలనడకన వెళ్లారు. అక్కడ మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

జూలపల్లి, ఫిబ్రవరి 21 : మండలంలోని తెలుకుంట, అబ్బాపూర్ గ్రామశివారుల్లో సమ్మక్క, సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను చేశారు. వేడుకలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చే రానుండడంతో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ శ్రీధర్ బందోబస్తు చేపట్టారు.

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 21: మీర్జంపేటలో నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా బుధవారం కంకవనం గద్దెలకు చేరుకుంది. ఆలయ నిర్వాహకులు డప్పుచప్పుళ్లతో కోయపూజారుల పూజలు, శివసత్తుల నృత్యాలతో గ్రామం నుంచి కంకవనం గ్రామస్థులు తండోపతండాలుగా ఊరేగింపుగా గద్దెలకు తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఉయ్యాల అశోక్‌గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉయ్యాల సుమన్‌గౌడ్, ఎంపీటీసీ గూడెపు జనార్ధన్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని పెగడపల్లి, పెద్దరాతుపల్లి, మీర్జంపేట గ్రామాల్లో జరిగే శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను తహసీల్దార్ జాహెద్‌పాషా పరిశీలించారు. పెద్దరాతుపల్లిలో వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. మీర్జంపేట జాతరలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వెంట మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, ఆర్ఐ ఉదయశ్రీ, రెవెన్యూ సిబ్బంది మహేష్, దాసరి విష్ణువర్ధన్ ఉన్నారు.

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 21 : మండలంలోని హన్మంతునిపేట, తుర్కలమద్దికుంట, పెద్దకల్వల గ్రామాల్లో బుధవారం సమ్మక్క-సారక్క జాతర ప్రారంభమైంది. బుధవారం సారక్కను సమీపగుట్టల ప్రాంతం నుంచి కోయపూజారులు సారలమ్మను డప్పుచప్పులతో గద్దెల వద్దకు తీసుకవచ్చిన అనంతరం గద్దెపైకి ఎక్కించారు. దీంతో మహిళలు పూనాకాలతో ఊగిపోయారు. భక్తులుపెద్దఎత్తున పూజలు చేశారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

మండలంలోని తుర్కలమద్దికుంట, హన్మంతునిపేట, పెద్దకల్వల గ్రామాల్లో నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని తుర్కలమద్దికుంటలో జాతర ఏర్పాట్లను ఎంపీడీవో పరిశీలించారు. వెంట వైస్‌ఎంపీపీ ముత్యాల రాజయ్యతో పాటు జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్గాం, ఫిబ్రవరి 21: మండలంలోని గోలివాడ సమ్మక్క-సారలమ్మ జాతరలో బుధవారం సాయంత్రం సారలమ్మకు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి డప్పుచప్పుళ్ల మధ్య జాతర ప్రాంగణానికి తీసుకువచ్చారు. అమ్మవారితో పాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులను కోయ పూజారులు గద్దెలపై ప్రతిష్ఠించారు. అమ్మవారిని తీసుకువస్తున్న సమయంలో భక్తులు పారవశ్యంతో మునిగిపోయారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాతరకమిటీ చైర్మన్ హన్మాన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పాలకుర్తి, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని రాణాపూర్, వేమునూర్, ఈసాలతక్కళ్ళపల్లి గ్రామాల్లో బుధవారం సారలమ్మను కోయ పూజారులు డప్పుల చప్పుళ్ల మధ్య గద్దెల వద్దకు చేర్చారు. కమిటీ చైర్మన్ గాలిపెల్లి శ్రీనివాస్, వైస్‌చైర్మెన్ నెరువట్ల రాజపోషం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సందర్శించారు. అనంతరం ఈసాలతక్కళ్ళపల్లి జాతారలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి వలంటీరీలకు టీ షర్టులను పంపిణీ చేశారు.

జాతరకు వెళ్లే భక్తులకు సరిపడా బస్సులు ఏర్పాటు చేయాలి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 21: మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులకు సరిపడా బస్సులను ఏర్పాటు చేయాలని గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణంకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం గోదావరిఖని బస్టాండ్‌లో భక్తుల కోసం ఏర్పాటుచేసిన వసతులపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. అనంరతం మేడారం వెళ్లే భక్తులకు వీడ్కోలు పలికారు. ఆయన వెంట ఆసిఫ్, శ్రీనివాస్, ఆర్‌టీసీ అధికారులు ఉన్నారు.

జాతరలకు గట్టి బందోబస్తు..

- పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 21 : పెద్దపల్లి నియోజకవర్గంలోని నిర్వహిస్తున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు పోలీస్ బందోబస్త్ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ అన్నారు. మండలంలోని తుర్కలమద్దికుంటలో జాతర ఏర్పాట్లను పెద్దపల్లి సీఐ కృష్ణతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా భక్తులు వచ్చేందుకు దారులు,వాహనాల పార్కింగ్, తాగునీరు, విద్యుత్ దీపాలు వంటి వసతులను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతర ప్రాంగణంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని శాఖల సమన్వయంతో జాతరను సజావుగా నిర్వహించాలన్నారు. పెద్దపల్లి ఎస్ఐ2 మల్లేష్, వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య, మాజీ సర్పంచ్ తంగెళ్ల జయప్రద-సంజీవరెడ్డి, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



బస్సుల క్యాంపునకు వస్తున్న భక్తులు



బస్సు ఎక్కుతున్న భక్తులు



పెద్దపల్లిలో మేదారం వెళ్లేందుకు బారులు తీరిన భక్తులు



నీరుకుళ్లలో సారలమ్మను గద్దెపైకి తీసుకవస్తున్న కోయ పూజారి



మీర్జంపేటలో కంకవనం తీసుకవస్తున్న భక్తులు



ఈసాలతక్కళ్లపల్లిలో సారలమ్మను గద్దెకు చేరుస్తున్న కోయ పూజారులు



హన్మంతునిపేటలో సారలమ్మను తీసుకవస్తున్న కోయ పూజారులు



ధర్మారంలో సారక్కను గద్దెను ఎక్కిస్తున్న పూజారులు



గోలివాడలో సారలమ్మను గద్దెపై ప్రతిష్టిస్తున్న కోయ పూజారులు

నీటి పారుదల అధికారులతో ఎమ్మెల్యే విజయరమణారావు సమీక్ష

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 21: సమ్మక్క-సారలమ్మ జాతరలు జరుగుతున్న ప్రాంతాల్లో నీటి పారుదల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఇరిగేషన్ అధికారులను సూచించారు. బుధవారం సమ్మక్క-సారలమ్మ జాతరను దృష్టిలో ఉంచుకొని సమీక్ష నిర్వహించారు. అలాగే చివరి ఆయకట్టు వరకు నీరందించాలన్నారు. ఒక్క రైతు కూడా పంటలు ఎండిపోయి నష్టపోవద్దని సూచించారు. ఎస్సారెస్పీలో నీరు సమృద్ధిగా ఉందన్నారు. నీటిని సరైన విధానంలో వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ ఎస్‌ఈ, ఈఈ, డీఈలు, అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓటరు నమోదుపై ఇంటింటా సర్వే నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 21: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఇంటింటా ఓటరు నమోదు, మార్పులు, చేర్పులపై బుధవారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో మెడికల్ కళాశాల, డిగ్రీ, పీజీ కళాశాల ప్రాన్సిపాల్, క్యాంపస్ అంబాసిడర్స్‌తో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పలు అంశాలపై బూత్ లెవల్ ఆఫీసర్లతో చర్చించారు. ఫామ్ 6,7,8కు సంబంధించిన నమోదు, మార్పులు, చేర్పులు, ప్రాసెసింగ్‌లపై శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, అంతర్గాం, పాలకుర్తి తహసీల్దార్లు కుమారస్వామి, రాంమోహన్, డీఎంసీ రజిని, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


సతీష్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21: మండలంలోని బొప్పాపూర్ గ్రామశివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం ఇసుక ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాకు చెందిన యువకుడు భూక్య సతీష్(22) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. అదే తండాలోని యువకుడు భూక్య సాయికుమార్ తీవ్రగాయాలయ్యాడు. ఎస్‌ఐ రమాకాంత్ కథనం మేరకు.. వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాలోని భూక్య మంజుల- రాజు దంపతుల ఒక్కగానొక్క కొడుకు సతీష్ ఎలక్ట్రీషియన్‌గా పనులు చేస్తుండేవాడు. బుధవారం ఉదయం తన ద్విచక్రవాహనం పై స్నేహితుడు సాయికుమార్‌తో కలిసి ఇంటి నుంచి గొల్లపల్లికి బయలుదేరారు. బొప్పాపూర్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ అతి వేగంగా ఢీకొట్టింది. దాంతో బైక్ ట్రాక్టర్ భాగంలో చిక్కుకుపోయింది. సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాల పాలైన సాయికుమార్ పరిస్థితి విషమంగా మారింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి మంజుల ఫిర్యాదు మేరకు మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ ఆలకుంట శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

● వారంలో గల్ఫ్ దేశానికి.. అంతలోనే అనంత లోకాలకు..

వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాలోని యువకుడు భూక్య సతీష్ వారం రోజుల్లో గల్ఫ్ దేశానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న క్రమంలో అతన్ని విధి రోడ్డు ప్రమాదం రూపంలో బలితీసుకుంది. కన్న కొడుకు గల్ఫ్ దేశానికి పయనమవుతున్న తరుణంలో అనంత లోకాలకు వెళ్లడంతో కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. తండాలోని మంజుల-రాజు దంపతులు కొడుకు సతీష్. రాజు రెండు నెలల కిందట గల్ఫ్ దేశానికి వలస వెళ్లాడు. కొడుకును గల్ఫ్ తీసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. వారం రోజుల్లో పయనమవుతాడనుకున్న కొడుకు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. మృత వార్త తెలుసుకున్న తండ్రి రాజు స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.


ట్రాక్టర్ కింద భాగంలో చిక్కుకున్న బైక్

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21: రెండు రోజుల కిందట అదృశ్యమైన వృద్ధుడు నేవూరి చంద్రారెడ్డి(60) తన ఇంటి సమీపంలోని పాడు పడిన పశువుల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం విషాదం నింపింది. ఎస్‌ఐ రమాకాంత్ కథనం మేరకు.. గ్రామంలోని చంద్రారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురవడంతో ఈ నెల 18న కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఈ నెల 19 ఉదయం నిద్రలేచే సరికి వృద్ధుడు చంద్రారెడ్డి కనిపించకుండాపోయాడు. బంధువులు, చుట్టు పక్కల ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. దాంతో తమ మామ కనిపించడం లేదని పేర్కొంటూ కోడలు అనురాధ ఈ నెల 20న ఫిర్యాదు చేయడంతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన చంద్రారెడ్డి తన ఇంటి సమీపంలోని పశువుల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటు వైపు వెళ్లిన స్థానికులకు దుర్వాసన రావడంతో గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

క్రమశిక్షణ, చట్టాలపై అవగాహన ఉండాలి

- అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ - పీటీసీ, సీటీసీల్లో కానిస్టేబుల్ శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న మహేష్ భగవత్, అభిషేక్ మొహంతి, శిక్షణకు హాజరైన కానిస్టేబుల్ అభ్యర్థులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: పోలీసుశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం పొందినవారు క్రమశిక్షణ, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ అన్నారు. పోలీసుశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కరీంనగర్‌లోని పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ), సిటీ పోలీసు శిక్షణ కేంద్రం (సీటీసీ)లో బుధవారం నుంచి శిక్షణ ప్రారంభమైంది. ఈ శిక్షణను రాంనగర్‌లోని పీటీసీలో అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ ప్రారంభించగా, ఉజ్వల పార్కు వద్ద సీటీసీలో పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి ప్రారంభించారు.

ఈ సందర్భంగా అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ అభ్యర్థులు శిక్షణ సమయంలో ఏకాగ్రతతో నేర్చుకున్నట్లయితే ఉద్యోగం సమయంలో సమర్థవంతంగా పనిచేయగలుగుతారన్నారు. పోలీసు ఉద్యోగం అనేది ఒక బాధ్యతాయుతమైనదన్నారు. సమాజంలో రోజురోజుకు నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ నేరాలు నియంత్రణ కోసం సాంకేతిక పరిజ్ఞానంపై పట్టుసాధించాలన్నారు. రాంనగర్‌లోని పీటీసీలో హైదరాబాద్, రాచకొండ, సైబారాబాద్, నల్గొండ, గద్వాల నుంచి 675 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు శిక్షణకు హాజరయ్యారు. వీరందరికీ 9 నెలలపాటు ఇక్కడే శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్, డీఎస్పీలు మల్లికార్జున్, విజయపాల్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

● ప్రజలకు సేవచేసే అవకాశం అధికం: సీపీ

ఇతర ప్రభుత్వ శాఖలకంటే పోలీసు శాఖ ద్వారా ప్రజలకు సేచేసే అవకాశం అధికమని కరీంనగర్ పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. కరీంనగర్ సీటీసీలో సంగారెడ్డి జిల్లాకు చెందిన 235 మంది కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులకు శిక్షణను బుధవారం సీపీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 30 సంవత్సరాల పాటు పోలీసుశాఖ తరఫున ప్రజలకు సేవలు అందించే బాధ్యత ఉంటుందన్నారు. పోలీసు ఉద్యోగం చేయాలంటే ఫిజికల్ ఫిట్‌నెస్ ముఖ్యమని, శిక్షణలో కరీంనగర్ మొదటి స్థానంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్ అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, ఏసీపీ వేణుగోపాల్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరి పరిస్థితి విషమం

ముస్తాబాద్, ఫిబ్రవరి 21: మండలంలోని నామాపూర్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరోకరు తీవ్రంగా గాయపడ్డారు. గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన దమ్మన్నపేట నర్సింహులు (50), దమ్మన్నపేట దేవయ్యలు (55) ముస్తాబాద్ నుంచి లింగన్నపేట వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. నామపూర్ గ్రామంలో ఎదురుగా వచ్చిన ట్రాలీఆటో ఢీకోట్టడంతో నర్సింహులు మృతిచెందగా తీవ్రగాయాలైన దేవయ్య సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

వ్యవసాయబావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య



పప్పు నర్సయ్య(ఫైల్)

మానకొండూర్, ఫిబ్రవరి 21: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన పప్పు నర్సయ్య (90) అనే వృద్ధుడు బుధవారం వ్యవసాయబావిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డట్టు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. నర్సయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా నయం కాలేదని తెలిపారు. వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని వ్యవసాయబావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కుటుంబసభ్యుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని బావిలో నుంచి మృతదేహన్ని బయటికి తీశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఖాతాదారులను మోసం చేసిన అక్షర చిట్‌ఫండ్స్

- చైర్మన్, ఇద్దరు డైరెక్టర్ల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న ఒకటో టౌన్ ఎస్‌ఐ రవికుమార్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: ఖాతాదారులకు సకాలంలో డబ్బులు చెల్లించకుండా మోసగించినందుకు, ఖాతాదారుల డబ్బులతో సొంత ఆస్తులు కూడబెట్టుకునందుకు కరీంనగర్‌లోని అక్షర చిట్‌ఫండ్స్‌పై ఇటీవల ఒకటో టౌన్, రెండో టౌన్‌ల్లో కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు అక్షర చిట్‌ఫండ్స్ చైర్మన్ పేరాల శ్రీనివాసరావు, ఇద్దరు డైరెక్టర్లు సూరినేని కొండలరావు, ఉప్పల రాజేందర్‌ను ఒకటో టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మరో ముగ్గురు డైరెక్టర్లపై కేసు నమోదైంది. ఒకటో టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. చిట్ డబ్బులు సభ్యులకు చెల్లించకుండా మోసం చేసినందుకు ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిట్స్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1999 సెక్షన్ 3, 4 ప్రకారం నిందితులపై ఐపీసీ సెక్షన్ 406, 420 రెడ్‌విత్ 34, 5 కింద అక్షర చిట్‌ఫండ్స్ చైర్మన్, ఐదుగురు డైరెక్టర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్‌కు చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి శ్రీరాం వెంకట్‌రెడ్డి అక్షర చిట్‌ఫండ్స్‌లో రూ.7 లక్షల చిట్ వేశాడు. చిట్ గడువు ముగిసినప్పటికీ డబ్బులు చెల్లించకుండా చిట్‌ఫండ్స్ యాజమాన్యం ఇబ్బందులకు గురిచేశారు. బాధితుడు ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. హన్మకొండలోని సుబేదారి, వడ్డేపల్లి ఎక్స్‌రోడ్ ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన పేరాల శ్రీనివాసరావు అనే వ్యక్తి తిరుపతిరెడ్డి అనే వ్యక్తితో కలిసి హన్మకొండలో అక్షర చిట్‌ఫండ్స్ సంస్థను ఏర్పాటు చేశారు. ఆ తరువాత తిరుపతిరెడ్డి ఆ సంస్థ నుంచి ఉపసంహరించుకోగా శ్రీనివాసరావు భార్య శ్రీవిద్య, సూరినేని కొండలరావు, ఉప్పల రాజేందర్, అలువల వరప్రసాద్, గోనె రమేష్‌లు డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. అక్షర చిట్‌ఫండ్స్‌కు కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్, బోధన్, ఆదిలాబాద్, పెద్దపల్లి, గోదావరిఖని, మంచిర్యాల, హైదరాబాద్, ఖమ్మం, నల్గొండ, ఇతర పట్టణాలలో 54 బ్రాంచిలు ఉన్నాయి. ఏజెంట్ల నుంచి సభ్యులను చేర్పించుకుని చిట్స్ నిర్వహిస్తున్నారు. ఖాతాదారుల నుంచి సేకరించిన డబ్బులతో ఆ సంస్థ పలు చోట్ల భూములు కొనుగోలు చేసింది. గడువు ముగిసిన సభ్యులకు చిట్ డబ్బులు చెల్లించకుండా, ఆ డబ్బులకు అధిక వడ్డీ చెల్లిస్తామని వారిని నమ్మించి ప్రభుత్వ అనుమతి లేని డిపాజిట్ బాండ్ల రూపంలో బాండ్‌లను ఇస్తూ కాలయాపన చేశారు. బాండ్ల కాలపరిమితి ముగిసినా తిరిగి రెన్యూవల్ చేస్తూ వచ్చారు. ఖాతాదారుల డబ్బులతో వెదిర, వెలిచాలలో అక్షర టౌన్‌షిప్, అక్షర టౌన్‌షిప్ ఇండియా పేరిట 50 ఎకరాల భూమి కొనుగోలు చేశారని, గాడిపల్లి, నగునూర్‌లలో కూడా కొంత భూమి కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్‌లోని నాలుగు బ్రాంచీల్లో 800 మంది సభ్యులను చేర్పుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో అరెస్టు చేసిన ముగ్గురిని కోర్టులో హాజరుపరచి జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హనుమాన్‌నగర్‌లో అగ్నిప్రమాదం

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని హనుమాన్‌నగర్ లోని ఓ ఇంటిలో బుధవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. పెంకుటిల్లుకు అంటుకున్న మంటలను అదుపుచేసి పక్కనే గల రెండు గదులకు ప్రమాదం సంబవించకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు గంటపాటు శ్రమించి అగ్నిమాపక సిబ్బంది పూర్తిగా మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో సుమారు నాలుగు లక్షల 50 వేల రూపాయల నష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ తెలిపారు. నిత్యావసర వస్తువులు, బంగారం, వెండి, గ్యాస్ సిలిండర్ సర్టిఫికెట్స్ బట్టలు కొంత నగదు, టీవీ, బట్టలు, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధం అయినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది మహమ్మద్ సిరాజుద్దీన్, పి చంద్రయ్య, కె శ్రీనివాస్, పి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం, సైకిల్ ఢీ: ఒకరి మృతి

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 21: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో గల పెద్దంపల్లి గ్రామ కమాన్ సమీపంలో ద్విచక్ర వాహనం, సైకిల్ ఢీకొన్న సంఘటనలో దొడ్డె పరుశురాములు (59) మృత్యువాత పడ్డాడు. పెద్దంపల్లి గ్రామానికి చెందిన దొడ్డె పరుశురాములు గ్రామంలోని ఓ శుభకార్యానికి హాజరై తిరిగి ద్విచక్రవాహనంపై జమ్మికుంటకు వస్తున్నాడు. అదే సమయంలో అటువైపు వెళ్తున్న నరసయ్యను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. ఈ క్రమంలో పరుశురాములు అక్కడికి అక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరగంటి రవికుమార్ తెలిపారు.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ గౌతమి



జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గౌతమి

వేములవాడ, ఫిబ్రవరి 21: మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గౌతమి ఆలయ అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను బుధవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జాతర ఏర్పాట్లలో అలసత్వం వహించవద్దని, పనుల్లో వేగం పెంచాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు సమన్వయ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, క్యూలైన్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ ఏర్పాట్లు తదితర పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఈఈ రాజేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, ఎడ్ల శివ ఉన్నారు.

రాజన్న సేవలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే

వేములవాడ ఫిబ్రవరి 21: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దర్శించుకున్నారు. బుధవారం నాడు ఆయన కుటుంబ సమేతంగా కోడె మొక్కు చెల్లించుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా, ఆలయ సూపరింటెండెంట్ అల్లి శంకర్ స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు ఆయన వెంట ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గంగాధర, ఫిబ్రవరి 21: బతుకు దెరువుకోసం వచ్చిన ఓ యువకుడు మేస్త్రీ పని చేస్తుండగా ప్రమాదవశత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన మండలంలోని గర్శకుర్తిలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం నెల్లూరు జిల్లాకు చెందిన చీమలదిన్నె బాలగురవయ్య(26) కొద్ది రోజులుగా గర్శకుర్తిలో భవన నిర్మాణ మేస్త్రీగా పని చేస్తున్నాడు. బుధవారం ఇంటి స్లాబ్‌పై సైడు గోడ కడుతున్నాడు. పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు బాలగురవయ్య చేయి తాకి కరెంటు షాక్ మృతి చెందాడు.మృతుడి సోదరుడు శ్రీనివాసులు పిర్యాధు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సుబ్రమణ్యం(60) అనే వృద్ధుడు మంగళవారం రాత్రి మృతి చెందాడని అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 13న వేములవాడలో చెట్టు పైనుంచి కిందపడి గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో తీసుకువచ్చిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వెళ్లినట్లు తెలిపారు. సుబ్రమణ్యం ప్రకాశం జిల్లా దర్శి మండలానికి చెందిన వ్యక్తిగా ఆసుపత్రి రికార్డులో నమోదై ఉందని, మిగతా వివరాలు తెలియరాలేదన్నారు.

కోల ప్రశాంత్‌కు వేములవాడ పోలీసుల పీటీ వారెంట్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: నకిలీ డాక్యుమెంట్లతో భూకబ్జాలకు పాల్పడి కోటి 37 లక్షలు వసూలు చేసిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న కార్పొరేటర్ భర్త కోల ప్రశాంత్‌ను బుధవారం వేములవాడ పోలీసులు పీటీ వారెంట్‌పై జైలు నుంచి తీసుకువెళ్లారు. కోల ప్రశాంత్‌పై వేములవాడలో రెండు ఎస్సీ, ఎస్టీ, రెండు భూకబ్జా కేసులు నమోదైనట్లు సమాచారం. ఈ కేసుల్లో కోల ప్రశాంత్‌ను నిందితుడిగా కోర్టులో హాజరుపరిచేందుకు పీటీ వారెంట్‌పై తీసుకువెళ్లారు.

● భూకబ్జా, బెదిరింపులకు సంబంధించిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్యను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. విచారణ అనంతరం బుధవారం సాయంత్రం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో భూమయ్యను ఇప్పటికే పోలీసులు రెండుసార్లు కస్టడీకి తీసుకుని ఆయన ఇంటిలో సోదాలు జరిపి పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకోగా మంగళవారం మరోసారి కస్టడీకి తీసుకుని విచారించారు. తీగలగుట్టపల్లిలో భూమయ్య పలు భూకబ్జాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపులు తయారు చేసి పంచాయతీకార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

రాజకీయ లబ్ధికోసమే సర్పంచ్‌లపై ఎంపీ మొసలి కన్నీరు



బండి సంజయ్ సర్పంచులకు రాసిన లేఖ ప్రతులను చూపుతున్న జడ్పీ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 21: ఎంపీగా బండి సంజయ్ ఏనాడూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏ ఒక్క గ్రామాన్ని సందర్శించలేదని, సర్పంచులకు ఎలాంటి ఆర్థిక సహాయం చేయలేదని, ఎన్నికలు సమీపించే సరికి రాజకీయ లబ్ధి కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారని కరీంనగర్, హన్మకొండ, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్లు కనుమల్ల విజయ, డాక్టర్ సుధీర్‌బాబు, ద్యావ వసంత విమర్శించారు. బుధవారం కరీంనగర్‌లో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎంపీ సంజయ్ సర్పంచులకు మీ ఆదరాభిమానాలు ఉండాలని లేఖ రాయడాన్ని తీవ్రంగా ఖండించారు. సర్పంచులు ఐదేళ్లు అధికారంలో ఉండగా ఏనాడూ స్థానిక సంస్థల గురించి, సర్పంచుల సమస్యలపై, గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరును గానీ పట్టించుకోలేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో సర్పంచుల ముందు మొసలికన్నీరు కార్చుతున్నాడని విమర్శించారు. గ్రామాలకు నిధులు మంజూరు చేయాలని పార్లమెంట్‌లో ఏనాడూ సంజయ్ మాట్లాడలేదని, ఆయనకు ఏ భాషపై కూడా పరిజ్ఞానం లేదన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా ఆయన పూర్తిగా అనర్హుడని విమర్శించారు. ఉపాధిహామీ పనిదినాలను 13 కోట్ల నుంచి ఏడు కోట్ల పనిదినాలకు తగ్గిస్తే కనీసం గ్రామాల్లో కూలీలకు పని కల్పించాలని ఏనాడూ కోరలేదని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లోని ప్రతి ఇంటికి నల్లానీటిని అందించే పథకాన్ని నీతిఆయోగ్ ప్రశంసిస్తూ 24 కోట్ల రూపాయలు రాష్ట్రానికి ఇవ్వాలని రెకమండ్ చేస్తే వాటిని కేంద్రం ఇవ్వలేదని, దీనిపై కూడా సంజయ్ నోరుమెదపలేదని అన్నారు. ఇంటింటికి రాముని ఫొటోలను పంపిణీ చేయడం కాదు, ఎంపీగా ప్రజలకు ఏమి చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఒక్క జడ్పీ సమావేశానికి కూడా ఎంపీగా సంజయ్ హాజరు కాలేదన్నారు. వ్యవసాయాన్ని ఉపాధిహామీతో అనుసంధానం చేయాలని మాజీ సీఎం కేసీఆర్ అనేకసార్లు ప్రధానికి లేఖరాస్తే ఎందుకు దానిపై స్పందించలేదని నిలదీశారు. ఇప్పుడు సర్పంచులకు అండగా ఉంటామని చెబుతూ మొసలికన్నీరు కారుస్తున్నారని, ఏ సర్పంచు ఆయనను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు తానే తెచ్చానని, రాష్ట్రంలోని అన్ని పథకాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులేనని సంజయ్ చెప్పుకోవడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో జడ్పీకి 20శాతం ఇవ్వాల్సి ఉండగా మోదీ సర్కార్ ఐదు శాతానికి తగ్గించిందని, దీనిపై ఏనాడైనా సంజయ్ మాట్లాడాడా అని ప్రశ్నించారు.


కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య


భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం


జంపన్న వాగు వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


జాతరలో జాతకాలు చెబుతున్న కోయదొరలు


జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు

- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం

మేడారం.. జన సంద్రం..


సమ్మక్క గద్దె

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభం జనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాటపట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటు చూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జన మైంది.




వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.


జంపన్నవాగు నుంచి గద్దెల వద్దకు వచ్చే దారిపై భక్తజనం రద్దీ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సమావేశం

మంథని, జనవరి 21: మంథని నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంథని ఆర్డీవో కార్యాలయంలో ఈఆర్‌వో హనుమా నాయక్ బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగే వార సమీక్ష భాగంగా ఆర్డీవో సమావేశమయ్యారు. ఓటర్ల జాబితా సవరణ, పార్లమెంట్ ఎన్నికల సన్నాహక చర్చ తోపాటు వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు నియోజకవర్గంలోని 10 మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

నేడు ఓడేడులో అదనపు కలెక్టర్ పర్యటన

ముత్తారం ఫిబ్రవరి 21: మండలంలోని ఓడేడు గ్రామపంచాయతీ పరిధిలో గురువారం అదనపు కలెక్టర్ అరుణశ్రీ పర్యటించనున్నారని ఎంపీడీవో లలిత తెలిపారు. గ్రామంలో లైబ్రరీని అరుణశ్రీ ప్రారంభించనున్నారని తెలిపారు.

ఖనిలో నేత్రదాతకు నివాళి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 21: గోదావరిఖని హనుమాన్‌నగర్‌కు చెందిన నేత్ర దాత కొయ్యల ఎల్లయ్యకు బుధవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి కుటుంబ సభ్యులకు అభినందన పత్రాన్ని అందజేశారు. సదాశయ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి రాజమౌళి, రాష్ట్ర ప్రతినిధులు కెఎస్ వాసు, పట్టణ శాఖ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, నేత్రదాత కుటుంబ సభ్యులు మల్లేష్, స్వప్న, సుభద్ర, రాంచందర్, తరుణ్, హర్షవర్ధన్, శశకుమార్, శివాణి కృష్ణ, బిందు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వైన్‌షాపుల యజమానులు

- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

ముత్తారం ఫిబ్రవరి 21 : ముత్తారం వైన్‌షాపుల్లో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వం రెండు వైన్‌షాపులను మంజూరు చేసింది. నిబంధనల ప్రకారం ఒక షాపునకు ఒక కౌంటర్ మాత్రమే ఉండాలి. కానీ వైన్ షాప్‌ల యజమానులు రెండు కౌంటర్లు ఏర్పాటు చేసుకున్నారు. ముందు కౌంటర్‌లో ప్రభుత్వ నిబంధన ప్రకారం మద్యం అమ్మకాలు చేస్తూ.. వెనుక కౌంటర్‌లో బెల్ట్‌షాపుల నిర్వాహకులకు మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ప్రస్తుతం సమ్మక్క-సారలమ్మ జాతరసీజన్ కావడంతో మద్యం అక్రమ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అయినప్పటికీ ఎక్సైజ్ పోలీస్ శాఖ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయంపై మంథని ఎక్సైజ్ సీఐ రాకేష్‌ను వివరణ కోరగా తాను సమ్మక్క జాతర డ్యూటీలో ఉన్నానని, ఇప్పుడు తాను ఏమి చేయలేనని సమాధానం ఇచ్చారు.

షాపింగ్ కాంప్లెక్స్ లీజుదారులతో సమావేశం

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) ఆధ్వర్యంలో ఉన్న 26 షాప్ లతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్ లీజు దారులతో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి మధుమోహన్ బుధవారం కళాశాలలో రివ్యూ నిర్వహించారు. 2024 మార్చి 31 తో షాపింగ్ కాంప్లెక్స్ లో ఉన్న 26 షాపులకు లీజు గడువు ముగుస్తున్న నేపథ్యంలో, లీజు కొనసాగింపు, అద్దె చెల్లింపు, తదితర అంశాలపై లీజు దారులతో నిర్వహించిన సమావేశంలో చర్చించడం జరిగింది. సమావేశంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, షాప్ లీజుదారులు తదితరులు పాల్గొన్నారు.

డయేరియాతో విద్యార్థి మృతి

జూలపల్లి, ఫిబ్రవరి 21 : మండలంలోని వడుకాపూర్‌కు చెందిన మొగురం శంకరయ్య మనుమడు తమన్ అనే విద్యార్థి డయేరియాతో బుధవారం మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం ప్రకారం.. మొగురం శంకరయ్య తన కూతురు కొడుకును తన వద్దనే ఉంచుకుని పోషిస్తున్నాడు. గ్రామంలోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తమన్ 5వ తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం తమన్‌తోపాటు కుటుంబ సభ్యులు బంధువుల ఇంటిలో జరిగిన ఫంక్షన్‌కు పోయివచ్చారు. మరుసటి రోజు నుండి బాలుడికి స్వల్పంగా జ్వరంతోపాటు వాంతులు, విరేచనాలు మొదలై తీవ్రస్థాయికి చేరుకోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శంకరయ్య సైతం డయేరియాతో అనారోగ్యానికి గురికాగా కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు వివరించారు.

డిగ్రీ ఫలితాల్లో ట్రినిటి విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 21 : శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన మొదటి, మూడవ సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు కమిటీ డిగ్రీ పీజీ కళాశాల విద్యార్థులు సాధించారు. విద్యార్థులను కళాశాల అధినేత మాజీ ఎంఎల్‌ఏ దాసరి మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజు, వైస్‌ప్రిన్సిపాల్ సీతారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

సింగరేణిలో ఉద్యోగాలు భర్తీ చేయండి

- కారుణ్య నియామకాలను వేగవంతం చేయండి - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

గోదావరిఖని, ఫిబ్రవరి 21: సింగరేణిలో ఖాళీగా ఉన్న 317డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులను, 168ఇంటర్నల్ పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ సిద్ధం చేయాలని సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. సింగరేణి సమస్యలు, అభివృద్ధి, సంక్షేమంపై బుధవారం సచివాలయంలో సంస్థ సీఎండీ బలరాం నాయక్, డైరెక్టర్(పా) ఎన్‌వీకే శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యోగాల నియామక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదని, సింగరేణి ఉద్యోగ మేళలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ మేరకు కారుణ్య నియామకాలను వేగవంతం చేయాలని, సింగరేణి వారసుల వయోపరిమితి 35సంవత్సరాల నుంచి 40ఏళ్లకు పెంచే విషయంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని, సింగరేణి కార్మికుల కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎలాంటి ప్రీమియం చెల్లించనవసరం లేకుండా చేసుకున్న కోటి రూపాయల ప్రమాదబీమాపై అవగాహన ఒప్పందం పురోగతిపై డిప్యూటీ సీఎం అడిగితెలుసుకున్నారు. ప్రమాద భరితమైన బొగ్గు రంగ సంస్థలో పని చేస్తున్న 43వేల మంది ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా అందించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించిన వాళ్లం అవుతామన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్మించిన 10.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను ఈనెల 26న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా సింగరేణి ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన సోలార్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని, రామగుండం, శ్రీరాంపూర్ ఏరియాకు త్వరితగతిన సురక్షిత మంచినీటిని అందించేందుకు ర్యాపిడి గ్రావిట్ ఫిల్టర్లను ప్రారంభించడానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ వేసవిలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి, రవాణాపై రోజు వారీగా సమీక్ష నిర్వహించి బొగ్గు కొరత లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

అధికారికి సన్మానం

రామగిరి, ఫిబ్రవరి 21:త్వరలో ఉద్యోగ విరమణ పొందుతున్న సర్వే జనరల్‌మేనేజర్ శశికాంత్‌రవిని బుధవారం ఘనంగా సత్కరించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు ఘనంగా సత్కరించి మెమొంటో అందజేశారు.కార్యక్రమంలో అధికారులు ఎలీషా, రఘుపతి, శ్రీనివాసులు, రాధకృష్ణ, వెంకటరమణ, జైనులబద్దిన్, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రాజేశ్వరి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి


ఓసీపీ-3ని పరిశీలిస్తున్న డైరెక్టర్

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 21: ఆర్జీ-2 ఏరియాకు నిర్దేశించిన వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సింగరేణి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఓసీపీ-3 ప్రాజెక్టును ఆయన సందర్శించారు. వ్యూపాయింట్ నుండి ప్రాజెక్టు పని స్థలాలను పరిశీలించి, ఉత్పత్తి మెరుగుదలకు తీసుకోవాల్సిన పనులపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం డ్రాగ్‌లైన్ పని తీరును పరిశీలించారు. ఏరియాలో వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు తీసుకుంటున్న చర్యలను జీఎం సూర్యనారాయణ డైరెక్టర్‌కు వివరించారు. డైరెక్టర్ వెంట జీఎంతో పాటు పీవో మధుసూదన్, సర్వే అధికారి నర్సింగరావు, ఎస్ఎస్‌వో షరీఫ్ మహమ్మద్ ఉన్నారు.

'పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలి'

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 21 : రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు సతీష్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని అమర్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. తొలి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు నడిపెల్లి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన 3డిఎలను వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మందల శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మోతె సమ్మయ్య, ఆర్థిక కార్యదర్శి జి.మాధవాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 21: నిబంధనలు పాటించ ఇటుక బట్టీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పెద్దపల్లి ఏరియా కార్యదర్శి సీపెల్లి రవిందర్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రవిందర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కనీస వసతులు పాటించకుండా నడిపిస్తున్న ఇటుక బట్టీలను సీజ్ చేసి యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అక్రమ వెంచర్‌లపై అధికారుల కొరడా

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 21: పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 1116/1లోగల 5.1 ఎకరాల భూమిలో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్‌లో బుధవారం పంచాయతీ అధికారులు హద్దురాళ్లను తొలగించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం బోల్తా పడి ముగ్గురికి గాయాలు

మహాముత్తారం, ఫిబ్రవరి 21: మేడారం మహాజాతరకు వెళ్లి తిరిగి వస్తున్న భక్తుల వాహనం బోల్తాపడి ముగ్గురు గాయపడిన సంఘటన భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం దూళికట్ట గ్రామానికి చెందిన 15 మంది భక్తులు ఓ వాహనంలో మేడారానికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో యామన్‌పల్లి-నిమ్మగూడెం గ్రామాల మధ్య వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో వాహనంలో ఉన్న తిరుపతి, లక్ష్మి, రుక్కమ్మకు గాయాలయ్యాయి. ఎస్సై సుధాకర్ క్షతగాత్రులను భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 21: విద్యార్థులు రానున్న వార్షిక పరీక్షల్లో విజయవంతంగా రాసి మంచి ఫలితాలు సాధించి రామగుండానికి రాష్ట్ర స్థాయిలో పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆకాంక్షించారు. బుధవారం గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో జరిగిన సీనియర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, ఎన్ఎస్ఎస్ అధికారి జీడి కనకయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొలనూర్ గుట్టల్లో గద్దెపైకి సారలమ్మ

ఓదెల, ఫిబ్రవరి 21 : మండలంలోని కొలనూర్ గుట్టల్లో బుధవారం సారలమ్మను తాళమేళాలతో తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. చైర్మన్ దేవిడి శ్యామ్‌రెడ్డి, ఎస్సై అశోక్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో సమ్మక్క-సారలమ్మ పూజలు


వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 21: సుల్తానాబాద్ అల్ఫోర్స్ స్కూల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమ్మక్క-సారలమ్మ దేవతల పూజ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి పాల్గొని అమ్మవారలను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర విశిష్టత గురించి, వనదేవతల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు జాతర సెటింగ్‌తోపాటు సమ్మక్క సారలమ్మలను గద్దెలకు తీసుకురావడం వంటివి ప్రదర్శించారు.

సమ్మక్క జాతరకు బ్రిలియంట్ విద్యాసంస్థల విరాళం

ధర్మారం, ఫిబ్రవరి21: ధర్మారంలో జరుగుతున్న సమ్మక్క జాతరకు బుధవారం బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్ సిరిపురం సత్యనారాయణ రూ. 15 వేల విరాళాన్ని నిర్వహకులకు అందజేశారు. కార్యక్రమంలో జాతర అడహక్ కమిటీ కన్వీనర్ మేడవేని తిరుపతి, కోశాధికారి ఓరెం చిరంజీవి, మాజీ సర్పంచ్ దేవి పద్మజనార్థన్, కాంపెల్లి రాజేశం తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

ధర్మారం, ఫిబ్రవరి 21: మండలంలోని నందిమేడారం పంచాయతీ కార్యదర్శిగా శంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కట్ట రమేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజయ్య పలువరు సన్మానించారు.

కస్తూర్బా స్కూల్‌లో మాక్ జడ్పీ సమావేశం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 21: సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయంలో బుధవారం ఎనిమిది, తొమ్మిదవ తరగతులకు చెందిన బాలికులు మాక్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మేడారంలో బుధవారం నుంచి ఈనెల 24 వరకు జరిగే జాతర వివరాలను కళ్లకు కట్టినట్టు వివరించారు. సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ ఎం స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు ఎర్రబాటి రాజేశ్వరరావు, హైకోర్టున్యాయవాది అశోక్‌రావు దంపతులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల నుంచి భక్తులు ఉత్సవాలను దర్శించుకున్నారు.

మట్టి లారీలను సీజ్ చేసిన పోలీసులు

అంతర్గాం, ఫిబ్రవరి 21: కుందనపల్లి యాష్‌పాండ్ సమీపంలో బుధవారం కొంతమంది ప్రభుత్వ భూమి, పట్టా భూముల్లో అక్రమంగా మట్టి తవ్వుతుండగా రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొద్దిరోజులుగా అనుమతులు లేకుండా టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలించుకుపోతున్నారు. దీంతో రైతులు అంతర్గాం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ వెంకట్ ఆధ్వర్యంలో మట్టి లారీలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

'స్థానికులకే ఎంపీ టికెట్ ఇవ్వాలి'

గోదావరిఖని, ఫిబ్రవరి 21: పెద్దపల్లి ఎంపీ టికెట్ స్థానికులకే ఇవ్వాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాల్వ లింగస్వామి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న న్యాయవాది కొప్పుల శంకర్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు తిప్పారపు శ్రీనివాస్, నాయిని ఓదెలు, బొమ్మక రాజేష్, రవి, సత్యనారాయణ, చెరుకు శంకర్ పాల్గొన్నారు.